ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 26 డిసెంబరు 2024





టౌన్‌హాల్ చర్చిలో మేరీమాత, బాలఏసు ప్రతిమలు

క్రిస్మస్ సందడి

- చర్చిల్లో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- జిల్లా వ్యాప్తంగా వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



తెలుగు బాప్టిస్టు చర్చిలో ఏసు గీతాలను ఆలపిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం క్రైస్తవులు క్రిస్మస్‌ను సందడిగా జరుపుకొన్నారు. మంగళవారం అర్థరాత్రి నుంచే సంబరాలు చేసుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్వీట్లు, కేకులు పంచిపెట్టారు. శాంతి, కరుణ, ప్రేమకు ప్రతిరూపం ఏసు అని, క్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఫాదర్లు పిలుపునిచ్చారు. చర్చిలన్నీ విద్యుత్ దీపాలతో మెరిసిపోయాయి. శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్ చర్చి, సహాయమాత, వర్షిప్, తెలుగు బాప్టిస్టు, కిస్టోన్ తదితర చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి.. ఏసు గీతాలను ఆలపించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. క్రీస్తుమార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాలని ఫాదర్లు పిలుపునిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.



ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న సహాయమాత చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు

ఆగని వాన

- అన్నదాతల్లో ఆందోళన ● వరుస అల్పపీడనాలతో కుదేలు
- తడుస్తున్న ధాన్యం బస్తాలు, వరి కుప్పలు ● మరో తుఫాన్ హెచ్చరికతో గుబులు



శ్రీకాకుళం నగరంలో కురుస్తున్న వర్షం

జి.సిగడాం/సరుబుజ్జిలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరుసగా ఏర్పడుతున్న తుఫాన్లు, అల్పపీడనలు, వాయుగుండాలు జిల్లా రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోన్నాయి. మునుపెన్నడూ లేని విధంగా ఒకే నెలలో ఒక భారీ తుఫాన్‌తో పాటు మూడు అల్పపీడనాలు ఏర్పడడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. అల్పపీడన కారణంగా గత వారం రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కళ్లాలు, పొలాల్లో ఉన్న వరి కుప్పలను కాపాడుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. పొలాల్లో దిబ్బలుగా వేసి ఉన్న వరి పనలు మొలకెత్తే అవకాశం ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. అపరాల పంటలైన పెసర, మినుమ అలాగే మొక్కజొన్న పంట కూడా వర్షాలకు పాడవడంతో (మిగతా 8వ పేజీలో)



సరుబుజ్జిలి శివాలయం వద్ద సీసీ రహదారిపై భద్రపరిచిన ధాన్యం బస్తాలు

ఆకాశం నుంచి నిఘా!



- తూర్పు కనుమల్లో అత్యంత ఎత్తులో ఉండేవి మహేంద్రగిరులు. ఏవోబీలో ఉండే ఈ కొండల మధ్య దండకారణ్యం ఉంటుంది. విలువైన వృక్ష సంపద, అరుదైన జంతువులు ఉంటాయి. గంజాయి వనాలు సాగవుతుంటాయి. ఆపై సారా తయారీ శిబిరాలు వెలుస్తుంటాయి. జంతు వేట యథేచ్ఛగా సాగిపోతుంటుంది. కానీ, దండకారణ్యంలో నిందితుల ఆచూకీ కనుగొనడం కష్టం. డ్రోన్లు అయితే ఇట్టే పసిగట్టగలవు. నిందితుల ఆచూకీ కనుగొనగలవు.
- శ్రీకాకుళం నగరానికి ఆనించి నాగావళి నది ఉంటుంది. నదీ తీర ప్రాంతాల చెంతనే పదుల సంఖ్యలో వాహనాలు కనిపిస్తాయి. కానీ, అక్కడ ఎవరూ కనిపించరు. కొంచెం నది లోపలికి వెళ్లి పరిశీలిస్తే డొంకలు, పిచ్చి మొక్కల మధ్య విపరీతమైన పొగ వస్తుంటుంది. గంజాయి, మద్యం తాగే వారు కనిపిస్తారు. అలాంటి వారిని పోలీసుల డ్రోన్లు వెంటాడుతాయి. ఇట్టేగుర్తిస్తాయి. వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తారు.
- సాధారణంగా నగరాలు, పట్టణాల చెంతన రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తుంటారు. అయితే, అక్క డ ఇళ్ల నిర్మాణాలు ఆలస్యమవుతుంటాయి. అటువంటి ప్రాంతా లు గంజాయి, మత్తు పదార్థాలు సేవించేవారికి కేంద్రాలుగా మారుతుంటాయి. అటువంటి చోట్ల వాలిపోతాయి పోలీసుల డ్రోన్లు. మద్యం, మత్తు పదార్థాల మాటున నేరాల సంఖ్య పెరుగుతుండడాన్ని పోలీసులు గుర్తించారు. అందుకే ముందుగా బహిరంగా మద్యం, మత్తు పదార్థాలు సేవించ డాన్ని నియంత్రించాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే డ్రోన్లను రంగంలోకి దించారు.

- పోలీస్ శాఖలో డ్రోన్ల వినియోగం
- నగర, పట్టణ శివారులపై డేగకన్ను
- నేరం జరిగే ప్రాంతాలు ఇక జల్లెడ
- ఖాళీ ప్రదేశాల్లో మందు, గంజాయి తాగితే చర్యలు
- నేర నియంత్రణే లక్ష్యమంటున్న ఎస్పీ

● జేఆర్ పురం సర్కిల్ పరిధిలోని రణస్థలం పరిసర ప్రాంతాల్లో పోలీసులు డ్రోన్ల ద్వారా ఇలా జల్లెడ పట్టారు. అత్యాధునిక కెమెరాలతో కూడిన డ్రోన్లను ఆకాశంలో విడిచిపెట్టి ఆ ప్రాంతం మొత్తాన్ని చిత్రీకరించారు. అక్కడ ఎవరు పేకాట ఆడినా.. మద్యంతో పాటు మత్తు పదార్థాలు సేవించినా.. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా ఇట్టే గుర్తిస్తారు. అదుపులోకి తీసుకుంటారు.

రణస్థలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని సర్కిళ్లతో పాటు నేరాలు అధికంగా నమోదయ్యే చోట డ్రోన్ల సేవలను వినియోగంలోకి తెచ్చేందుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ప్రయోగాత్మకంగా జేఆర్‌పురం సర్కిల్‌లో డ్రోన్లను వినియోగించింది. ఇది సక్సెస్ కావడంతో జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని భావిస్తోంది. జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. 193 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. మరోవైపు 197 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి సైతం ఉంది. ఇంకో వైపు వందల కిలోమీటర్ల రైల్వేలైన్ విస్తరించి ఉంది. ఆపై మన్య ప్రాంతం.. చెంతనే ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఉన్నాయి. అందుకే నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గంజాయి రవాణాకు జిల్లా అడ్డాగా మారుతోంది. అదే సమయంలో తూర్పు కనుమల్లో ఒకటైన మహేంద్రగిరులు సరిహద్దు ప్రాంతంలో ఉన్నాయి. విలువైన వృక్ష సంపదతో పాటు అరుదైన జంతువులు, జీవరాశులు ఉన్నాయి. జిల్లాలో సహజ సంపద రక్షణ, నేరాల నియంత్రణ విషయంలో పోలీస్ శాఖకు అనేక రకాల సవాళ్లు ఎదురవుతున్నాయి. ఇదంతా పోలీస్ మేన్ పవర్‌తో ఛేదించడం అసాధ్యం. అందుకే పోలీస్ శాఖ డ్రోన్ల సేవలను వినియోగించుకోవాలని భావిస్తోంది. జిల్లాలో శ్రీకాకుళం నగరంతో పాటు ఆమదాలవలస, పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మునిసిపాల్టీలు ఉన్నాయి. సోంపేట, టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట వంటి పట్టణాలు ఉన్నాయి. వీటన్నింటినీ డ్రోన్ల హబ్‌లోకి తేవాలని పోలీస్ శాఖ భావిస్తోంది. గతంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. కానీ నిర్వహణ లోపంతో నేరాలు జరిగినా నిందితులను పట్టుకోలేని పరిస్థితి నెలకొంది. పట్టణాలతో పాటు ప్రధాన కూడళ్లు, రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి చోరీలు, ప్రమాదాల విషయాల్లో మాత్రమే ఉపయోగపడేవి. వాటికి సంబంధించి నిడివి, చిత్రీకరించే పరిధి తక్కువగా ఉండడంతో నేర నియంత్రణలో సీసీ ఫుటేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో ఉపయోగపడని దుస్థితి నెలకొంది. ఇప్పుడు డ్రోన్ల వినియోగం అధికమవుతుండడంతో పోలీస్ శాఖ సైతం ఈ వ్యవస్థపై మొగ్గుచూపుతోంది.

ఎక్కడ తప్పు జరిగినా..

నేరాల తీవ్రత ఎక్కువగా నగరాలు, పట్టణ శివార్లలోనే ఉంటుంది. నిర్మానుష్య ప్రాంతాలు, పొలాలు ఉన్నచోట నిందితులను పట్టుకోవడం కత్తిమీద సాములా మారుతుంది. అలాంటి నేరాలను నియంత్రించేందుకు పోలీస్ శాఖ వినూత్న ఆలోచన చేసింది. ఎక్కడ ఏ తప్పు జరిగినా ఇట్టే పట్టేసేలా ఏర్పాట్లు చేసింది. నేరుగా అయితే దుండగులు, నిందితులు తప్పించుకుంటారని భావించి ఆకాశంలో నిఘా పెట్టేలా డ్రోన్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా సులువుగా నిందితులను గుర్తిస్తున్నారు. నేరాలు ఎక్కువగా పెరగడానికి మద్యం, గంజాయి మత్తే ప్రధాన కారణం. నగర శివారు ప్రాంతాల్లో వాటిని సేవించి రోడ్లపైకి రావడం, ప్రమాదాలకు గురికావడం, గొడవలకు దిగి శాంతిభద్రతల విఘాతానికి కారణం కావడం (మిగతా 8వ పేజీలో)

మద్యం రోడ్డు పాలు

- మినీ వ్యాన్ నుంచి జారిపడిన సీసాలు
- విలువ రూ.1.50 లక్షలు

పలాస, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు వాహనంలో తరలిస్తున్న మద్యం సీసాలు రోడ్డుపై జారిపడ్డాయి. దీంతో రూ.1.50 లక్షల విలువైన మద్యం రోడ్డు పాలైంది. వివరాల్లోకి వెళ్తే.. పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వైన్ షాపులకు మద్యం సరఫరా చేసేందుకు గాను ఎచ్చెర్లలోని బేవరేజస్ యూనిట్ నుంచి మద్యం సీసాలతో మినీ వ్యాన్ బుధవారం ఉదయం బయలుదేరింది. అయితే, పలాస పారసంబ వద్ద జాతీయ రహదారికి సమీపంలో వర్షం కారణంగా మద్యం అట్టపెట్టెలు తడిసిపోయి సీసాలు రోడ్డుపై జారిపడ్డాయి. పారసంబ నుంచి శాసనం రోడ్డు వరకూ రెండు కిలోమీటర్ల పొడవునా మద్యం సీసాలు పడిపోయాయి. విషయం తెలుసుకున్న వ్యాన్ డ్రైవర్ వాహనాన్ని ఆపి పరిశీలించాడు. ఈ సీసాల్లో చాలా వరకు ధ్వంసమవడంతో రోడ్డంతా మద్యం పారింది. కొన్ని సీసాలు పగలకపోవడంతో వాటిని



పారసంబ వద్ద పగిలిపోయిన సీసాలను బయటకు తీస్తున్న వాహన సిబ్బంది

స్థానికులు తీసుకుపోయారు. మొత్తం వీటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని అంచనా. ఈ మేరకు వ్యాన్ డ్రైవర్ కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జనం సొమ్ము.. రాళ్ల పాలు!

- ప్రచారం తప్ప ప్రయోజనం లేని భూసర్వే ● ఎక్కడ చూసినా సర్వే రాళ్ల కుప్పలే ● గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం



● మెళియాపుట్టి మండలం పరశురాంపురం పంచాయతీ టీకేఆర్ పురం, బెల్లుపాడు, సింగుపురం రెవెన్యూ గ్రామాల్లో సుమారు 450 ఎకరాలు భూమి ఉంది. ఇందులో సాగు భూమి 340 ఎకరాలు మాత్రమే. వివిధ రకాలు పంటలు సాగు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ భూ సర్వే జరకుండానే హద్దు రాళ్లు తరలించి ఇలా కుప్పలుగా పోసేశారు.

మెళియాపుట్టి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో జగనన్న భూ రక్ష పేరుతో చేపట్టిన భూసర్వే కేవలం ప్రచారానికే పరిమితమైంది. ఈ సర్వే వల్ల రైతుల భూ సమస్యలు పరిష్కారం కాకపోగా మరిన్ని ఎక్కువయ్యాయి. రూ.కోట్లు ఖర్చు చేసి చేపట్టిన ఈ భూసర్వేతో రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెట్టి గత భూసర్వేలో జరిగిన తప్పిదాలను సరి చేస్తుంది. అలాగే, సర్వే రాళ్లపై ఉన్న జగన్ బొమ్మ, పేరును తొలగిస్తుంది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 30 మండలాల్లోని 1,465 రెవెన్యూ గ్రామాలకు గాను 738 గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వంలో భూ రీసర్వే పూర్తి చేసినట్టు అధికారులు చెబుతున్నారు. సర్వే చేసిన రెవెన్యూ గ్రూప్‌లో జగనన్నా భూరక్ష పేరుతో రూ.40.05 కోట్లు నిధులు వెచ్చించారు. భూ సరిహద్దుల్లో పాతడానికి గ్రానైట్ రాళ్లు వినియోగించారు. వీటిపై జగన్ బొమ్మలు వేశారు. దీనిపై విమర్శలు రావడంతో రాళ్లపై జగన్ బొమ్మ తీసేసి జగనన్న భూసర్వే (మిగతా 8వ పేజీలో)

బిడ్డ మృతిపై బంధువుల నిరసన

- వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణం
- అధికారులు చర్యలు తీసుకోవాలి
- టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో ఘటన



8లో

వణికిస్తున్న చలి

- రెండు రోజులుగా ఉష్ణోగతలు గణనీయంగా పడిపోయిన వైనం

8లో



ఘనంగా క్రిస్మస్

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

క్రిస్మస్ వేడుకలను జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ఏసుక్రీస్తు గొప్పతనాన్ని వివరించి, ఆయన బోధనలను వినిపించారు. చర్చిలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చర్చిలు, ఇళ్ల వద్ద క్రైస్తవులు కేకులు కట్ చేసి.. వేడుకలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


అరసవల్లి: కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


నరసన్నపేట: హడ్కోకాలనీ చర్చిలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి..


పలాస: కొవ్వొత్తులు వెలిగించి..


టెక్కలి: లివింగ్‌స్టోన్ చర్చిలో కేక్‌కట్ చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి


ఇచ్ఛాపురం: కేక్ కట్ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ


రణస్థలం: క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


పొందూరు: ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కేక్ తినిపిస్తున్న చిన్నారి


శ్రీకాకుళం కల్చరల్: టౌన్‌హాల్ చర్చిలో..


శ్రీకాకుళం కల్చరల్: ఉమెన్స్ కళాశాల దగ్గర ఉన్న వర్షిప్ చర్చిలో..



పాతపట్నం: జేసీపీఈఎం చర్చిలో చిన్నారుల కోలాటం



మందస: మండల కేంద్రంలోని చర్చిలో గీతాలాపన


కంచిలి: జాడుపూడి చర్చిలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు

వాజ్‌పేయికి నివాళి

రణస్థలం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి జయంతి వేడుకలు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

బూర్జ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పొట్నూరు శ్రీనివాస రావుకు మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి లక్ష రూపాయలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ తన క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడే నారాయణరావు, కాగితాపల్లి రామకృష్ణ, కూనబిల్లి తవిటినాయుడు, మక్క రాము, లోలుగు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

రణస్థలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలోని నారువ గ్రామానికి చెందిన నరసయ్య ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైన నేపథ్యంలో బుధవారం జనసేన నేత వడ్డాది శ్రీను బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. దుస్తులు, బియ్యం ప్యాకెట్, ఆర్థికసాయం చేశారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండండి

గార, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్దనరావు అన్నారు. బుధవారం రాత్రి అంపోలులో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలు, ఏటీఎం మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించండి

గుజరాతీపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల బోధన అనుభవాన్ని పక్కన పెట్టి ఎలాంటి అనుభవం లేని వారికి పదోన్నతులకు రంగం సిద్ధం చేయడం ఎంత వరకు సమంజసమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ ప్రశ్నించారు. ఈమేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 20 ఏళ్ల కిందట స్కూల్ అసిస్టెంట్‌గా విధుల్లోకి చేరి నేటికి అదే కేడర్‌లో కొనసాగుతున్నారన్నారు. జిల్లాలో వేల కొద్ది స్కూల్ అసిస్టెంట్లు జేఎల్‌గా పదోన్నతులకు అర్హత కలిగి ఉన్నారన్నారు. ఈనేపథ్యంలో జీవో 223ను రద్దు చేసి అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు రేపు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్ వేదికగా ఈ నెల 27వ తేదీన జిల్లాస్థాయి ఫెన్సింగ్ క్యాడెట్ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలబద్రుని రాజా తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. అండర్-17 బాలురు, బాలికల విభాగాలలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పేర్లను 26 సాయంత్రం 5 గంటలలోగా నమోదు చేసుకోవాలని సూచించారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు కొనసాగించండి

సోంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒడియా మాధ్యమం ఉపాధ్యాయులకు ఇప్పటివరకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌లు రద్దు చేయడం తగదని, వాటిని తిరిగి కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఒడియా మాధ్యమం ఉపాధ్యాయులు ఒడియాలో బోధిస్తారని, అలాంటి వారికి తెలుగు మాధ్యమం కాంప్లెక్స్‌లో విలీనం చేయడం వల్ల ఇబ్బందులు పడతారని అన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ పాఢి, బృందావన దొళాయి, రామహరి పాఢి, బేసి కృష్ణమూర్తి, ఎన్.రవి కుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బూర్జ, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్జ గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలను బుధవారం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ పరామర్శించారు. కార్యక్రమంలో ఖండాపు గోవిందరావు, తొత్తడి సురేష్, బొడ్డేపల్లి నాగరాజు, బొడ్డేపల్లి వరహాలనాయుడు పాల్గొన్నారు.

సారా అరికట్టండి

సోంపేట, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొర్లాం పరిసర ప్రాంతాల్లో సారా అక్రమ రవాణా అరికట్టాలని బారువ ఎస్ఐ ఎస్.హరిబాబుకు ఆ గ్రామస్థులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాంబుడ్డి జానకిరావు, తామాడ వాసుదేవ్, రాంబుడ్డి గణపతి, పెద్దింటి జోగారావు తదితరులు ఉన్నారు.

విద్యుత్తు ప్రైవేటీకరణను ఆపండి

అరసవల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ప్రైవేటీకరణను ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ప్రభుత్వం విద్యుత్తు రంగాన్ని పరిరక్షించాలని, చండీఘర్ విద్యుత్తు ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక విద్యుత్తు ఎస్ఈ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లతో ప్రజలపై పెనుభారం పడుతుందని, వెంటనే స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. చండీఘర్ రాష్ట్ర ప్రభుత్వం డిస్కంను ప్రైవేటు సంస్థ అయిన కలకత్తాకు చెందిన ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్‌కు అమ్మడానికి నిర్ణయించిందని, నెలకు ఒక్కో ఎకరానికి భూమి విలువ ఒక్క రూపాయి మాత్రమే చెల్లించాలని నిర్ణయించడం దారుణమన్నారు. లాభాలు గడిస్తున్న సంస్థను చౌకగా కార్పొరేట్ పరం చేసేందుకు అక్కడి ప్రభుత్వం నిర్ణయించడాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. అలాగే కేంద్రప్రభుత్వం దేశంలోని పవర్‌గ్రిడ్ సబ్ స్టేషన్లను గంపగుత్తగా ప్రైవేట్‌కు అప్పగించడానికి ఉత్తర్వులు జారీ చేసిందని విమర్శించారు. ఈ ఒప్పందాలను రద్దు చేయాలని, చండీఘడ్ విద్యుత్తు కార్మికుల సమ్మెకు మద్దతు తెలపాలని కోరారు. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల వలన ప్రజలు ముందుగానే డబ్బులు చెల్లించాల్సి వస్తుందని, బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని అన్నారు. పేదలకు అంధకారమే మిగులుతుందన్నారు. ధర్నాలో కె.నాగమణి, ఎం.ఆదినారాయణమూర్తి, నాయకులు అల్లు. సత్యనారాయణ, కె.సూరయ్య, డి.సుధ, ఆర్.ప్రకాష్, పి.గోవర్ధనరావు, కె.కళ్యాణి, పి.లత, ఎం.లలిత, వి.హేమలత, కె.సుజాత, ఎల్.ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీనివాసరావు సేవలు నిరుపమానం

అరసవల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త, సంఘ సేవకుడు డాక్టర్ సూర శ్రీనివాసరావు అందించిన సేవలు నిరుపమానం అని జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కొనియాడాయి. ఈమేరకు బుధవారం శ్రీనివాసరావును నగరంలో వారు సత్కరించారు. ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా, ముఖ్యంగా కరోనా కష్టకాలంలో ప్రైవేటు పాఠశాలల సిబ్బందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేసి భరోసా కల్పించడం ప్రశంసనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేస్తూ గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని, జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయన చేసిన సేవలు, మేలు చిరకాలం మా హృదయాల్లో నిలిచి ఉంటుందని విద్యావేత్త, శ్రీసాయి విద్యాసంస్థల అధినేత బూరగాపు లక్ష్మణరావు కొనియాడారు. కార్యక్రమంలో సుమారు 100 మంది వివిధ ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.


శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రతినిధులు

సత్తా చాటిన జిల్లా కబడ్డీ జట్లు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్లు చారిత్రక విజయాలు సొంత చేసుకున్నాయి. ఈనెల 22 నుంచి 24 వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగిన రాష్ట్రస్థాయి బాలబాలికల జూనియర్ కబడ్డీ పోటీల్లో ఇరుజట్లు ఫైనల్స్‌లో ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించి విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో విజయనగరం జట్టుపై 32-16 పాయింట్ల తేడాతో, బాలుర జట్టు విజయనగరం జటుపై 39-18 తేడా స్కోరుతో టోర్నమెంట్ చాంపియన్లుగా నిలిచారు. రెండు జట్లు విజయం సాధించడంపై కబడ్డీ జిల్లా అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్యే గొండు శంకర్, అధ్యక్షుడు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు ముసలినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు విజేతలను అభినందించారు.



ట్రోఫీలతో జిల్లా జట్లు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

అరసవల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే గొండు శంకర్ భరోసా ఇచ్చారు. నగరంలోని దమ్మలవీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి రోడ్డున పడిన ఫాతిమాబేగం కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా రూ.10 వేలు, నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, దుస్తులను అందజేశారు. సంబంధిత తహశీల్దారుకు ఫోన్ చేసి ఆ కుటుంబానికి ప్రభుత్వ పరంగా రావాల్సిన సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి లక్ష్మీరాజ్యం, రెడ్డి గిరిజాశంకర్, కొమర కమల తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవ కరపత్రిక ఆవిష్కరణ

ఇచ్ఛాపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలమ్మపేటలో బుధవారం జైభీమ్‌సేన రెండో ఆవిర్భావ దినోత్సవ కరపత్రికను అసోసియేషన్ శ్రీకాకుళం అధ్యక్షుడు చల్లా దేవరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న ఆదివారం సోంపేట జైభీమ్‌సేన కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో బి.ఈశ్వరరావు, ఎన్.బాబూరావు, ఉర్జాన దేవరాజ్, పి.లోహిదాస్, డి.శ్యాం, ధర్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచండి

అరసవల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.అమ్మన్నాయుడు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.కల్యాణి, సుధ డిమాండ్ చేశారు. 42 రోజుల సమ్మె ఒప్పందంలో అంగీకరించిన అంశాలు అమలు చెయ్యాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. ఈమేరకు బుధవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పి.లత, కె.సుజాత, వి.హేమలత తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఇచ్ఛాపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు ఎస్ఎన్ పండా సతీమణి అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో బుధవారం పండాను ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ పరామర్శించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన అయ్యప్పస్వామి దేవాలయం ధర్మకర్త దుర్గా గురుస్వామి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో పాటు టీడీపీ పట్టణ కార్యదర్శి నందికి జాని, కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి, మాజీ కౌన్సిలర్ కొరాయి ధర్మరాజు, రెయ్యి జానకి రావు, త్రిపాఠి, చిన్నా గురుస్వామి పాల్గొన్నారు.

చెడు వ్యసనాల జోలికి పోవద్దు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 25, (ఆంధ్ర జ్యోతి): మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు పోలీసులు పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం సాయంత్రం వన్‌టౌన్, గార, రూరల్, మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ స్కూల్స్, గ్రామాల్లో సంకల్పం అవగాహన సదస్సులు నిర్వహించారు. వన్ టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ, గార ఎస్ఐ జనార్దన్, రూరల్ ఎస్ఐ కె.రాము పాల్గొన్నారు.

మాజీ వైస్ ఎంపీపీ ఆకస్మిక మృతి

పొందూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 25 : మండల కేంద్రానికి వస్త్ర వ్యాపారి, మాజీ వైస్ ఎంపీపీ కాకర్ల రాజారావు (55) బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతిచెందాడు. కొండవీధిలో దుకాణం వద్ద ఆర్థిక లావాదేవీల విషయంలో ఒక వ్యక్తితో వివాదం చోటుచేసుంది. అనంతరం ఇంటికి వెళుతున్న రాజారావు కుప్పకూలి పోయాడు. ఆసుపత్రికి తరలించినప్పటికే మృతి చెందారు. రాజారావు మృతిపై ఎమ్మెల్యే రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు.

వీడని వర్షం..అన్నదాతల్లో కలవరం

● తడిసి ముద్దవుతున్న ధాన్యం, వరి కంకులు



పోలాకి: నేలకొరిగిన వరిచేను



ఎల్.ఎన్.పేట: దబ్బపాదులో నీటిలో ఉన్న వరి చేను కుప్ప



పలాస రూరల్: జగన్నాథసాగర ఆయకట్టులో నేలకొరిగిన పంట

జిల్లాలో అల్పపీడనం ప్రభావంతో ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు తెరిపివ్వకపోవడంతో అన్నదాతలు కలవరపడుతున్నారు. పొలాల్లో పెట్టిన ధాన్యం కుప్పల్లోకి నీరుచేరడంతో పంట దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. ధాన్యం, వరి కంకులు తడిసిముద్దవుతుండడంతో రంగు మారిపోయే ప్రమాదముందని చెబుతున్నారు.వర్షాలు వీడకపోవడంతో పెసర,మినుగు పంటలకు కూడా నష్టం వాటిల్లే అవకాశముంది.ఈనేపథ్యంలో పంట పొలాలను అధికారులు బుధవారం పరిశీలించారు.

●పోలాకి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపేట, డోల, పోలాకి, చిత్రమానిపేటల్లో వరిపంట నేలకొరిగింది. ఎడతెరిపిలేకుండా కురిసినవర్షాలకు పొడివాతావరణం లేనివిధంగా కళ్లాలు, పొలాలు మారాయి. దీంతో వరికుప్పలు తడిసిముద్దై మొలకలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. మరో పక్క ఎండిన ధాన్యం కూడా తడిసి పోతున్నాయి. వీటిని ఆరబెట్టేందుకు వసతులు లేవని పలువురు రైతులు చెబుతున్నారు.

●ఎల్.ఎన్.పేట,డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని దబ్బపాడు, వాడవలస, చిట్టిమండలం, చింతలబడవంజ, రావిచెంద్రి, కోవిలాం, డొంకలబడవంజ, తురపేట, కృష్ణాపురంలో ధాన్యం కంకులు నీటిలోనే నానుతున్నాయి. కుప్పలు, ధాన్యంపై టార్పాలిన్లు కప్పినా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో తడిచిపోయాయని పలువురు వాపోతున్నారు. పెసర, మినుము, మొక్కజొన్న పంటపొలాల్లో నీరు నిల్వఉండడంతో నష్టం జరిగే అవకాముందని రైతులు వాపోతున్నారు.

●పలాస రూరల్,డిసెంబరు25(ఆంధ్రజ్యోతి):కాశీబుగ్గ జగన్నాథ సాగరం ఆయకట్టులో యంత్రాలతో వరిపంట కోసి ధాన్యం బస్తాలకు ఎత్తే క్రమంలో వర్షం కురియడంతో రైతులు ఇక్కట్లకు గురయ్యారు.ఉదయం నుంచి మేఘామృతం కాగా ఒక్కసారిగా మధ్యాహ్నం వర్షం కురవడంతో పొలాల్లో చేనును కుప్ప పెట్టలేక రైతులు అవస్థలుపడ్డారు.

● జలుమూరు డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడ, అల్లాడపేట, రామదాసుపేట ప్రాంతాల్లో తడిసిన వరి ఓదెలను పర్లాం డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు కింజరాపు సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.



నందిగాం: ధాన్యం బస్తాలపై టార్పాలిన్ కప్పిన దృశ్యం



జలుమూరు: అల్లాడలో కుప్పల వద్ద చేరిన వర్షం నీరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



త్రినాథ(ఫైల్)

రణస్థలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై నెలివాడ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిసిని గ్రామానికి చెందిన యజ్జాడ త్రినాథ (50) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు రణస్థలం నుంచి పిసిని గ్రామానికి స్కూటర్‌పై వెళ్తున్న త్రినాథ నెలివాడ జంక్షన్ వద్ద అండర్ పాస్ క్రాస్ చేస్తున్న సమయంలో ఆర్టీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. త్రినాథ మృతి చెందగా ఆయన భార్య చిన్నకు తీవ్ర గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేశారు.

రెక్కీ నిర్వహించి.. దొంగతనానికి పాల్పడి



సీసీఫుటేజీలో లభ్యమైన తాళం పగులగొడుతున్న దృశ్యం

టెక్కలి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): టెక్కలి అయ్యప్పనగర్‌లో మంగళవారం రాత్రి నిర్మాణం జరుగుతున్న ఓ ఇంట్లో ముందుగా ఓ వ్యక్తి రెక్కీ నిర్వహించి ఆ తర్వాత తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డాడు. నిర్మాణం జరుగుతున్న ఇల్లు కావడంతో అక్కడ ఎవరూ లేరు. ఓ వ్యక్తి ముసుగు ధరించి అక్కడే మద్యం సేవించి అనంతరం తాళం పగులగొట్టి ఇంట్లోకి దూరాడు. విద్యుత్‌కు సంబంధించిన సామగ్రి దొంగలించుకుపోయాడు. అయితే దొంగిలించిన వ్యక్తి ముందురోజు కూడా ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్లు సీసీ కెమెరా ఫుటేజీలో నమోదైంది. ఈ మేరకు ఇంటి యజమాని జోగి హేమసుందర్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి ఇద్దరికి గాయాలు

హరిపురం, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని హరిపురం-మందస రోడ్డులో పితాతోళి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు, పోలీసులు కథనం మేరకు..మందస పట్టణానికి చెందిన కె.జోగారావు సొండిపూడి జూనియర్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనతోపాటు కిరణ్ అనే యువకుడు పలాస వెళ్లి తిరిగి మందస వస్తున్నారు. వర్షంకురుస్తుండడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను 108లో హరిపురం ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సచేసి జోగారావుకు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా.. కిరణ్‌కు అక్కడడ చికిత్స నిర్వహిస్తున్నారు. ప్రమాదంపై మందస పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే

పోలాకి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలాకిలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. బుధవారం పోలాకిలో కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే డోలసీతారాములు జయంతి పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తొలుత డోలరోడ్డులో గల సీతారాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డోలజగన్, సుదర్శనరావు, కళింగ కార్పొరేషన్‌చైర్మన్ రోణంకికృష్ణంనాయుడు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎంపీ నాయుడు, బైరిభాస్కరరావు, వంశధార ఈఈ డోల తిరు మలరావు, రాంబాబు,సూరపునారాయణదాస్ వల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

ఉద్దానం రచయితలకు నిలయం

పలాస రూరల్, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలకు ఉద్దానం నిలయమని, నాటి నుంచి నేటి వరకూ ఎందరో కవులు, రచయితలు ఈ గడ్డ నుంచి పేరుప్రఖ్యాతులు సాధించారని వక్తలు తెలిపారు. బుధవారం మండలంలోని మాకనపల్లిలో ఉద్దానం రచయితల సంఘం(ఉరసం) ఆధ్వర్యంలో కవులు, రచయితలకు సన్మానించారు.ఈ సందర్భంగా ఉరసం సభ్యుడు కుత్తుమ వినోద్‌కుమార్ మాట్లాడుతూ కవులు, రచయితల విశిష్టతను తెలియజేసేందుకు ఏటా ఉద్దానం ప్రాంతంలోని ఉరసం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కవులు శివకుమార్, కోనేరు ఆదినారాయణ, ఎం.నాగేశ్వరరావు, డప్పు కళాకారుడు రామారావు, వంకల రాజారావును సన్మానించారు. అనంతరం వివిధ గీతాలను కళాకారులు ఆలపించారు. అనంతరం ఉరసం నూతన లోగో, బ్యాడ్జిలను మహిళా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కుత్తుమ తాతారావు పేరిట నగదు పురస్కారాలను గేదెల అప్పారావుకు అందజేశారు. కార్యక్రమంలో కళాకారులు కుమార్‌నాయక్, పి.కుసుమ, రవివర్మ, పి.వెంకటేష్, కోటేశ్వరరావు, ప్రసాద్, రాజేశ్వరి, లలిత, మధు, యువశక్తి యువజన సంఘం ప్రతినిధులు, పి.మాధవరావు, మాకనపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

కొండపైకి ఎక్కి.. సదస్సులు నిర్వహించి

● రెవెన్యూ సమస్యలపై గిరిజనుల వినతి



కేరాశింగిలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

మెళియాపుట్టి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపైభాగంగా ఉన్న కేరాశింగి, చందనగిరి పంచాయతీల్లో రెవెన్యూసదస్సులు ఎట్టకేలకు నిర్వహించారు. కొండపైభాగంలో పంచాయతీలు ఉండడంతో కిందిభాగంలో ఉండే గొడ్డ తదితర గ్రామాల్లో సమావేశాలు నిర్వహించేవారు. అయితే డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మన్యం జిల్లాలో పర్యటన సమయంలో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామని, డోలీలు లేకుండా చేయడమే ధ్యేయమని ప్రకటించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం వైసీపీ హయాంలో నిలిపివేసిన రహదారులకు నిధులు మంజూరుచేయడంతో పనులు చేపట్టారు. దీంతో ఇక్కడ కేరాశింగి, చందనగిరి పంచాయతీలకు రోడ్లు వేయడంతో అధికారులు పైకి వెళ్లి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. దీంతో కేరసింగి ఏడు, చందనగిరి ఐదు రెవెన్యూ సమస్యలపై గిరిజనులు వినతిపత్రం అందజేశారు.

జేఎల్‌గా పదోన్నతులు కల్పించాలి

● ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ

టెక్కలి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్నట్లు 40 శాతం మంది ఉపాధ్యాయులకు జేఎల్స్‌గా పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శవన్నగారి బాలాజీ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలిలో ఆపస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన జీవో-302ప్రకారం ప్రభుత్వ, జడ్పీ ఉపాధ్యాయులకు ఇంటర్ బోధించేందుకు జూనియర్ లెక్చరర్లగా పదోన్నతులు ఇచ్చేవారని తెలిపారు.కొన్నాళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 2023 జీవోద్వారా జూనియర్ లెక్చరర్లకు ప్రమోషన్లు లేకుండా చేసిందని తెలిపారు. పదిశాతం నాన్‌టీచింగ్ సిబ్బందికి జేఎల్స్‌గా పదోన్నతులు కల్పిస్తున్నారని, ఎన్‌సీటీఈ ప్రకారం బీఎడ్ అర్హత లేని కాంట్రాక్ట్ టీచర్లకు అవకాశం ఇస్తున్నప్పుడు, బోధన అనుభవం గల వారికి జూనియర్ లెక్చరర్లగా ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సమావేశంలో ఆపస్ జిల్లా అధ్యక్షులు శివరామప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శవన్నగారి బాలాజీ

బిడ్డ మృతిపై బంధువుల నిరసన

● టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో ఘటన

● వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యుల రోదన

టెక్కలి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రి ప్రసూతి విభాగంలో వైద్యురాలు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బిడ్డ మృతిచెందిందని నందిగాం మండలంలోని కైజోల గ్రామానికి చెందిన పడ్ల శ్రావణి కుటుంబసభ్యులు, బంధువులు నిరసన తెలిపారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శ్రావణికి పురిటినొప్పులు ప్రారంభం కావడంతో మంగళవారం ఉదయం 11గంటలు సమయంలో జిల్లా కేంద్రాసుపత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యులు అక్కడే ఉంచాలని సూచించడంతో శ్రావణిని ఆసుపత్రిలో చేర్పించారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. పురిటినొప్పులతో బాధపడుతున్న శ్రావణి పరిస్థితిని చూసి అత్త కృష్ణవేణి డాక్టర్‌ను పిలిపించి, మందులేయండి, లేదా అంబులెన్స్‌లో పలాసలో వైద్యులు దగ్గరకు వెళ్లిపోతామని అక్కడ ఉన్న సిబ్బందికి కోరింది. ఇప్పుడు శ్రావణిని పంపిస్తే మార్గమధ్యలో డెలివరీ వస్తే ఏమి చేస్తావు, ఇక్కడే ఉంచు అంటూ అక్కడున్న వైద్య సిబ్బంది కృష్ణవేణికి నచ్చజెప్పారు. అక్కడున్నసిబ్బంది డాక్టర్ ధనలక్ష్మికి ఫోన్‌చేసి విషయం చెప్పారు. ఈలోగా శ్రావణికి పురిటినొప్పులు మరింత తీవ్రమయ్యాయి. అక్కడున్న వైద్య సిబ్బందితో తాను నొప్పులు భరించలేకపోతున్నాను,ఆపరేషన్ చేసి బిడ్డను, తనను కాపాడాలని శ్రావణి వైద్యసిబ్బందిని వేడుకుందని అత్త కృష్ణవేణి చెబుతోంది. కాగా బుధవారం ఉదయం వైద్యురాలు ధనలక్ష్మి చేరుకొని శ్రావణికి నార్మల్‌డెలివరీకి అవసరమైన చర్యలు చేపట్టడంతో మగబిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన మగబిడ్డ మెడకు పేగు చుట్టుకొని ఉండడం, ఊపిరిలేకపోవడంతో ఆ బిడ్డ మృతిచెందినట్లు వైద్యులు ధనలక్ష్మి ధ్రువీకరించారు. ఈ విషయం అక్కడున్న శ్రావణి భర్త శంకరరావు, అత్త కృష్ణవేణి, బంధువులకు తెలియజేయడంతో రోదనలు మిన్నంటాయి. వైద్యురాలు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బిడ్డ మృతి చెందిందని నిరసన తెలిపారు. తాము ఆపరేషన్ చేయాలని బతిమిలాడినా సిబ్బంది పట్టించుకోలేదని కన్నీరుమున్నీరుగా విలపించారు.కాగా ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఈ విషయంపై ఆరాతీశారు.



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న బంధువులు

మెడకు పేగు చుట్టుకోవడం వల్లే బిడ్డ మృతి

డెలివరీ ప్రక్రియ అంతా నార్మల్‌గానే సాగిందని ప్రసూతి విభాగం డాక్టర్ ధనలక్ష్మి తెలిపారు. సాధారణ కాన్పు ద్వారా బిడ్డను బయటకు తీసేసరికి అప్పటికే బిడ్డ మెడకు పేగు చుట్టుకొని అస్వస్థతకు గురై మృతిచెందిందని చెప్పారు. చిన్నపిల్లల వైద్యులు కూడా వచ్చి పరిశీలించారని, ఇందులో తన తప్పేమీ లేదని తెలిపారు.

వైద్యులు సకాలంలో స్పందించలేదు



పురిటినొప్పులతో శ్రావణి బాధపడుతున్నా వైద్యులు సకాలంలో స్పందించలేదు. ఉదయం ఆరు గంటలకు వైద్యురాలు వచ్చి నార్మల్ డెలివరీకి ప్రయత్నంచేసినా బిడ్డ మృతిచెందింది. వైద్యురాలు, సిబ్బంది నిర్లక్ష్యమే బిడ్డ మృతికి కారణం. ఆసుపత్రిలో వైద్యురాలు ఉండకపోవడం మరో కారణం. ఇటువంటిపరిస్థితి మరొకరికి జరగకూడదు.వారిపై చర్యలు తీసుకోవాలి.

-శంకరరావు, బాధితురాలు భర్త

20 దుంగలు సీజ్



ఇచ్ఛాపురంలోని సామిల్లులో తనిఖీచేస్తున్న అటవీశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇచ్ఛాపురం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని సురంగిరాజా మైదానం సమీపంలో గల సామిల్లులో అనుమతి లేకుండా నిల్వఉంచిన 20 దుంగలను స్వాధీనం చేసుకుని సామిల్లు యజమాని చిరంజీవిపై కేసు నమోదు చేశామని కాశీ బుగ్గ ఫారెస్ట్‌రేంజ్ అధికారి మురళీకృష్ణ నాయుడు తెలిపారు. 'కలప తరలిపోతోంది' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అటవీశాఖజిల్లా అధికారులు స్పందించారు. పట్టణంలోని సా మిల్లులో మందస డీఆర్వో రాము, సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు జరిపామన్నారు. దాడుల్లో అనుమతి లేకుండా నిల్వఉంచిన కర్రలు సీజ్ చేశామన్నారు. ఒడిశాలో అనుమతి లేకున్నా ఆంధ్రాలోకి వచ్చే సరికి ప్రతీ కర్రకు అనుమతులు తప్పనిసరి అన్నారు. అనుమతి లేకుండా కలప నిల్వ ఉంచితే సా మిల్లులపై కేసులు నమోదు చేయడంతో పాటు మిల్లులను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

అయ్యప్ప భక్తులు ప్రత్యేక పూజలు

నరసన్నపేట, డిసెంబకు25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్‌లో గల సిద్ధాశ్రమంలో బుధవారం అయ్యప్ప భక్తులు మండల పూజ తోపాటు పూర్ణాహుతి, రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, మహాసమారాధన ప్రత్యేక పూజలను చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ నాయకులు శిమ్మ చంద్రశేఖర్, బైరి భాస్కరరావు, గొద్దు చిట్టిబాబు, పీస క్రిష్ణ, సాసుపల్లి కృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ వేర్వేరుగా పూజలను నిర్వహించారు.కార్యక్రమంలో సిద్ధాశ్రమ సుప్రీం కౌన్సిల్ సభ్యులు చింతు రామారావు, బోయన ఆనందరావు, తంగుడు జోగారావు, శిమ్మజగన్నాథం, చింతు చిన్నప్పన్న తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ఏపీజీవీబీ సేవలకు అంతరాయం

పోలాకి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలాకి, ప్రియాగ్రహారం, కోడూరు, దేశవానిపేటలో గ్రామీణవికాస్ బ్యాంక్(ఏపీజీవీ) సేవలకు ఈనెల 28 నుంచి 31వతేదీ వరకూ అంతరాయం కలుగుతుందని పోలాకి ఏపీజీవీబీ మేనేజర్ సూర్యనారాయణ, ప్రతినిధి అనీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలో ఉన్న బ్యాంకును విభజించనున్న నేపథ్యంలో 31వరకూ బ్యాంక్‌లావాదేవీలు, ఏటీఎం,లు, యూపీఐ, మొబైల్‌బ్యాంకింగ్ సేవలు పనిచేయవని పేర్కొన్నారు. అత్యవసరమైతే గురువారంలోగా సేవలు పొందవచ్చని తెలిపారు.

సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో నిలవాలి

కొత్తూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గం టీడీపీ సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేయాలని కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసివర ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. సభ్యత్వంలో నమోదులో రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈనెల 31 వరకు సభ్యత్వాలకు గడువు ఉందని తెలిపారు.

రాములు నేత్రాలు సజీవం

పొందూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డేపల్లిలో బుధవారం మృతి చెందిన బొడ్డేపల్లి రాములు (94) నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. రాములు అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో కుటుంబసభ్యులు రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ జగన్‌మోహన్‌రావుకు సమాచారం ఇచ్చారు. దాంతో మగటపల్లి కళ్యాణి నేత్ర సేకరణ కేంద్రం సిబ్బంది రాములు నుంచి నేత్రాలను సేకరించారు.

రోడ్లు బురదమయం.. రాకపోకలకు అగచాట్లు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ బురదమయంకావడంతో రాకపోకలకు వాహనచోదకులు అగచాట్లకు గురవుతున్నారు. ప్రధాన రహదారులు వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లపై గోతులయ్యాయి. దీంతో చిన్నపాటి వర్షాలకు గోతుల్లో వర్షం నీరు చేరి బురదమయం అవుతోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో బురదమయమైన రోడ్లపై వాహనాలు బోల్తాపడి గాయపడుతున్నామని పలువురు వాపోతున్నారు.



బెండి జంక్షన్‌వద్ద రోడ్డుపై గోతుల్లో చేరిన నీరు

వణికిస్తున్న చలి

● రెండు రోజులుగా ఉష్ణోగతలు గణనీయంగా పడిపోయిన వైనం



పరశరాంపురంలో చలిమంట కాగుతున్న గిరిజనులు

మెళియాపుట్టి, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో రెండురోజులుగా అల్పపీడనం ప్రభావంతోపాటు వర్షాలు కురుస్తుండడంతోపాటు చలిగాలుల తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. రెండురోజులుగా ఉష్ణోగతలు గణనీయంగా పడిపోయాయి.ఈ నేపథ్యంలో 15 నుంచి20 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి చలితీవ్రత పెరగడంతో కొండపై ఉన్న గిరిజనులు, వృద్ధులు అవస్థలకు గురవుతున్నారు. కొండ ప్రాంతాల్లోని నివాసముంటున్నవారు ఇళ్ల నుంచి బయటకురాలేకపోతున్నారు.కొంతమంది అగ్గిమంటలు వేసుకొని కాగుతున్నారు. మైదాన ప్రాంతాల్లో కూడా ఉదయం పది వరకు బయటకు రాలేకపోతున్నామని పలువురు వాపోతున్నారు. మెళియాపుట్టి, టెక్కలి, కొత్తూరు,పాతపట్నం, మందస, సోంపేట, నందిగాం మండలాల్లో చలి తీవ్రత పెరుగుతోంది.చలిగాలుల వల్ల ఊపిరితిత్తులు సమస్యలు ఉన్నావారంతా ఇబ్బంది పడుతున్నారు.

హైందవ శంఖారానికి తరలిరండి

కోటబొమ్మాళి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి):విజయవాడలో జనవరి ఐదోతేదీన విశ్వ హిందుపరిషత్ ఆధ్వర్యంలో జరిగే హైందవ శంఖారావం కార్యక్రమానికి హిందువులు తరలిరావాలని బీజేపీ మండలాధ్యక్షుడు మెట్ట తిరుమలరావు కోరారు. కోటబొమ్మాళిలో విలేకరులతో మాట్లాడుతూ ఆలయాలపై ప్రభుత్వం పెత్తనం చేయకుండా హిందూ సంఘాలు ఆధ్వర్యంలో నడవాలని కోరారు.

ఆగని వాన

(ఐదో పేజీ తరువాయి)

పెట్టుబడి కూడా రాని పరిస్థితి కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరుబుజ్జిలి ఆమదాలవలస మండలాల్లోని వంశధార, నాగావళి పరివాహక లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు పూర్తయ్యాయి. వాటిని పొలాల్లోనే కుప్పలుగా వేశారు. అయితే, ఈ నెల మొదటి వారంలో ఏర్పడిన పెంగల్ తుఫాన్ కారణంగా వర్షాలు పడడంతో ఆ కుప్పలు తడిసి పోయాయి. ఆ తరువాత వరుసగా ఏర్పడిన అల్పపీడనలు రైతులను నట్టేట ముంచాయి. నిత్యం కురుస్తున్న చిరుజల్లులతో వరి ఓదెలు తడిసి ముద్దవుతున్నాయి. అలాగే, పొలాలు, కళ్లాల్లో నిల్వ చేసిన ధాన్యంపై టార్పాలిన్లు, గడ్డి వంటివి కప్పినప్పటికీ అవి నానిపోతున్నాయి. ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోంది. దీనివల్ల రానున్న 24 గంటల్లో అనేక ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో మరింత నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ చివరి దశలో తాము నష్టపోతున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అప్పులపాలయ్యాను..



ఈ ఏడాది మేం నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంట సాగుచేస్తున్నాను. మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్న సమయంలో ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా పంట దెబ్బతిన్నది. ప్రస్తుతం తడిసిన ధాన్యం మొలకలు వస్తున్నాయి. రూ.1 లక్ష వరకు ఖర్చు పెట్టిన పెట్టుబడి బురదలో కలిసిపోయింది. ఇప్పుడు మా కుటుంబం అప్పులపాలైంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తమను ఆదుకోవాలి.

- బొడ్డేపల్లి సూరిబాబు, రైతు, కొత్తవలస

ఆకాశం నుంచి నిఘా!

(ఐదో పేజీ తరువాయి)

వంటివి ఇటీవల పరిపాటిగా మారింది. అందుకే నగర శివారు ప్రాంతాలు సైతం పోలీసుల అదుపులో ఉండేలా డ్రోన్ల వ్యవస్థ పోలీస్ శాఖకు చక్కగా ఉపయోగపడనుంది. జిల్లాలో డ్రోన్లు ఎగరవేసే బాధ్యతను సైబర్ క్రైం విభాగం చూస్తోంది. ప్రస్తుతం జిల్లా కేంద్రంతో పాటు జేఆర్‌పురం సర్కిల్ పరిధిలో ఈనెల 24న ప్రయోగాత్మకంగా చేపట్టారు. ప్రధానంగా గతంలో నేరస్థుల అడ్డాలు, వివిధ నేరాలు జరిగే చోట్లను గుర్తించి అక్కడ డ్రోన్లను ప్రయోగించి ఫొటోలు, వీడియోలు చిత్రీకరించారు.

డ్రోన్ల సహాయం తీసుకుంటున్నాం

నేరాల నియంత్రణకు డ్రోన్ల సహాయం తీసుకుంటున్నాం.జిల్లా వ్యాప్తంగా డ్రోన్ల సేవలు అందుబాటులోకి వస్తాయి. ఆకాశంలో నిఘా ఉంటుంది. ప్రయోగాత్మకంగా డ్రోన్ల ప్రదర్శన చేపట్టాం. అన్ని పోలీస్‌స్టేషన్లకు ఈ సేవలను అనుసంధానిస్తాం. సైబర్ క్రైం విభాగం పర్యవేక్షణలో డ్రోన్ల వ్యవస్థ పోలీస్ శాఖలో కొనసాగుతుంది.

- మహేశ్వరరెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

జనం సొమ్ము.. రాళ్ల పాలు!

(ఐదో పేజీ తరువాయి)

అని పేరు రాయించారు. ఒక్కో రాయి కోసం రూ.500 ఖర్చు చేశారు. రవాణా, పొలాల వద్ద పాతడానికి రూ.150 వరకు వ్యయం చేశారు. జిల్లాలో సుమారు 8 లక్షల హద్దు రాళ్లు సరఫరా చేసినట్లు అధికారులు తెలుపుతున్నారు. అయితే, ఈ కాంట్రాక్టను వైసీపీ నాయకులకే ఇవ్వడంతో వారు రూ.కోట్లు కూడబెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అధికంగా గ్రానైట్ పాలిస్ యూనిట్లు ఉండడంతో వాటి యజమానులను భయపెట్టి ఉచితంగా రాళ్లు తీసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. రాళ్లు పాతకుండానే రవాణా వ్యయం కింద రూ.12.01 కోట్ల వరకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించినట్లు తెలుస్తుంది. కాగా, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జగనన్న భూ సర్వే రాళ్లు తొలగించి వాటిపై ఉన్న పేర్లు చెరపడానికి రూ.1.20 కోట్లు ఖర్చు చేస్తుంది. ఒక రాయికి రూ.15 ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే పేర్ల తొలగింపు ఆఖరి దశకు చేరుకుంది.

పేర్లు తొలగించి వినియోగిస్తాం

సర్వే రాళ్లపై ఉన్న మాజీ సీఎం జగన్ బొమ్మ, పేరును తొలగిస్తున్నాం. కొన్ని గ్రామాల్లో భూ సర్వే నిర్వహించాల్సి ఉంది. అక్కడ ఈ రాళ్లను వినియోగిస్తాం.

-బి.పాపారావు, తహసీల్దార్, మెళియాపుట్టి